## నూతన కమిటీకి సన్మానం



అరుంధతి బంధు సేవ కమిటీల ప్రతినిధులను సన్మానిస్తున్న మల్లేశ్ తదితరులు

ఎర్రగడ్డ, అక్టోబర్ 27: 'అరుంధతి బంధు సేవ' మండలికి రాష్ట్ర, జిల్లా నూతన కార్యవర్గాన్ని ఇటీవల ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీల ప్రతినిధులను ఎర్రగడ్డకు చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు, దళితసేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అయిన గంట మల్లేశ్ నేతృత్వంలో శుక్రవారం పలువురు సన్మానించారు. అరుంధతి బంధు సేవ మండలి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి జీబీ సత్యేంద్ర కృష్ణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్‌లను సన్మానించారు. శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేసిన వాళ్లలో గంట మల్లేశ్‌తో పాటు దళితసేనకు చెందిన ఆనంద్‌కుమార్, భూపతిరాజ్, శివకుమార్‌లతో పాటు కార్యవర్గ సభ్యులు, అరుంధతి బంధు సేవ జిల్లా ప్రతినిధులు ఉన్నారు.

## సీవరేజీ లైన్ పనులు పరిశీలన

జూబ్లీహిల్స్,అక్టోబర్27: కలుషిత నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని జలమండలి జూబ్లీహిల్స్ సెక్షన్ మేనేజర్ శ్రీహరి తెలిపారు. డివిజన్-6 జీఎం హరిశంకర్ ఆదేశాలతో శుక్రవారం యూసుఫ్‌గూడ వెంకటగిరిలోని జలమండలి కార్యాలయం పరిధిలోని పలు ప్రాంతాల్లో సీవరేజీ లైన్‌ల పనులను పరిశీలించారు.

## సిక్కులకు ప్రభుత్వం పెద్దపీట




దసరా మిలాప్‌లో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి తలసాని

అమీర్‌పేట్, అక్టోబర్ 28 : సిక్కులకు ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం ఈ ఎన్నికల తరువాత తిరిగి రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వం ద్వారా 3 ఎకరాల స్థలంతో పాటు రూ.3 కోట్ల నిధులను మంజూరయ్యేలా తాను బాధ్యత తీసుకుంటానని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. దశాబ్దాలుగా నగరంలోని సిఖ్ చావ్‌నీలో స్థిర నివాసాలతో వేలాది మంది సిక్కులు జీవితాలను వెళ్లదీస్తున్నా.. ఆ స్థలాలపై ఎటువంటి చట్టపరమైన హక్కులు లేకపోవడంతో నిత్యం అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతున్న విషయాలను తెలుసుకున్న సీఎం కేసీఆర్‌ కే ఒక్క నిర్ణయంతో వారి స్థలాలపై వారికే చట్టపరమైన హక్కులు కల్పించారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ సారధ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం సిక్కుల మనోభావాలకు పెద్దపీట వేసిందన్నారు. శుక్రవారం అమీర్‌పేట్‌లోని హోటల్ అతిథిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన దసరా మిలాప్‌కు విశేషంగా తరలివచ్చిన సిక్కుల కుటుంబ సభ్యులతో మాజీ కార్పొరేటర్ శేషుకుమారితో కలిసి మంత్రి తలసాని సమావేశమయ్యారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఓటు వేసి రుణం తీర్చుకుంటామని సిఖ్ కుటుంబాలు ముక్త కంఠంతో ప్రకటించాయి.

## చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

జూబ్లీహిల్స్,అక్టోబర్27: దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని చాకచక్యంగా పట్టుకున్న కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మల్లయ్య, హోం గార్డులు సుదర్శన్, కృష్ణలను రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ శుక్రవారం నేరేడ్‌మెట్‌లోని తన కార్యాలయంలో అభినందించారు. వివరాల్లోకి వెళ్తే.. వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులకు హెల్మెట్ లేకుండా వస్తున్న వ్యక్తిని ఆపి వివరాలు సేకరించగా వారం రోజుల క్రితం నాగారం టీ జంక్షన్ సమీపంలో వాహనాన్ని దొంగిలించాడని తెలిసింది. తీగలాగితే.. అతడు గతంలో ఆటోమొబైల్ దొంగతనాలతో పాటు ల్యాప్‌టాప్ దొంగతనం, గంజాయి తదితర 15 కేసుల్లో ఉన్నట్లు తెలిసింది. దీంతో దొంగిలించిన వాహనంతో పాటు నిందితుడిని కీసర పోలీసులకు అప్పగించారు. ఈ తరహా దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పట్టుకున్నందుకు ఎస్ఐ, హోం గార్డులతో పాటు ఇన్‌స్పెక్టర్ రవీందర్‌ను సీపీ అభినందించారు.

# బీఆర్ఎస్ హయాంలోనే జనరంజక పాలన

**• ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్**


వెంగళరావునగర్, అక్టోబర్ 27 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజా రంజక పాలన కొనసాగుతుందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీ డివిజన్.. జయప్రకాశ్‌నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ తమ ప్రభుత్వ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి ఎంతో మంది సెటిలవుతున్నారన్నారు. అన్నదాతలను రైతుబంధు ఇచ్చి ఆదుకుంటుందన్నారు. తెలంగాణలో పంటల దిగుబడి కూడా బాగా పెరిగిందన్నారు. హైదరాబాద్ నగరం ఎంతో ప్రశాంతంగా ఉందని..శాంతిభద్రతలు బాగున్నాయని..ఇక్కడ ప్రతిరోజూ 250 సినిమా షూటింగులు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి ఫలాలు కళ్లముందు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయం ఖాయమని..అలాగే మూడోసారి తాను ఎమ్మెల్యేగా విజయం సాధించనున్నట్లు ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానికులు తమ సమస్యలను ఆయన దృష్టికి తేగా..సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ నాయకులు నాగేశ్వరరావు, రామినేని శ్రీనివాస్, వంశీ, గంగాధర్‌రావు, మధుయాదవ్, సంతోష్‌గౌడ్, ఫయాజ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.



జయప్రకాశ్‌నగర్‌కాలనీ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

**కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు..**

షేక్‌పేట్ అక్టోబర్ 27: సీఎం కేసీఆర్ చొరవతో ప్రభుత్వ పథకాలను రాజకీయాలకు అతీతంగా అందరికీ అందించామని బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు,జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం షేక్‌పేట్ డివిజన్ గుల్షన్ కాలనీలో స్థానిక డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు దుర్గం ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా చేపట్టడం జరిగిందన్నారు. కోట్ల రూపాయల నిధులతో ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి నిరంతరం కృషి చేశామన్నారు.సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరికీ అందించామని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు.



షేక్‌పేట్ గుల్షన్ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

## ప్రచార వాహనాలు ప్రారంభం



ప్రచార వాహనాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

బంజారాహిల్స్,అక్టోబర్ 27: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ తరపున ఎన్నికల ప్రచారం కోసం ప్రత్యేకంగా రూపొందించిన ప్రచార వాహనాలు సిద్ధమయ్యాయి. శనివారం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు,ఇతర నాయకులతో కలిసి ప్రచార వాహనాలు ప్రారంభించారు. ఒక్కో డివిజన్‌కు ఒక వాహనం ద్వారా స్థానిక నాయకులు ప్రచారం నిర్వహిస్తారని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సీఎన్‌రెడ్డి దేదీప్యరావు, రాజ్‌కుమార్ పటేల్‌తో పాటు అన్ని డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



బీఎల్వో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ రవి

జూబ్లీహిల్స్,అక్టోబర్27: ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని.. ఇప్పటినుంచి చేపట్టే విధులు పూర్తి ప్రాధాన్యత కలిగిఉంటాయని సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ రవి అధికారులకు సూచించారు. శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం షేక్‌పేట్‌లో ప్రిసైడింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్‌కు చేపట్టిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యూసుఫ్‌గూడ మహమూద్ ఫంక్షన్ హాల్‌లో బీఎల్ఓ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో కార్యాచరణకు సంసిద్ధంగా ఉండాలని.. వందశాతం ఓటింగ్ నమోదయ్యేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలింగ్ స్లిప్‌ల పంపిణీతో పాటు సీనియర్ సిటిజన్స్‌లో 80 ఏండ్లు పైబడిన ఓటర్లకు, పర్సన్ విత్ డిజేబుల్టీ (పీడబ్ల్యూడీ) ఓటర్లకు ఇంటివద్ద నుంచి ఓటు వేసేందుకు పోస్టల్ బ్యాలెట్‌లను అందజేయాలని సూచించారు. ఆయా వర్గాలలో ఆసక్తి ఉన్న వారిని పోలింగ్ బూత్‌లకు తరలించేందుకు వాహనాలు, సహాయకులతో పాటు వీల్‌చైర్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ నెలాఖరు వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉన్నందున 18 ఏండ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ శివ కుమార్, ఈఆర్ఓ సేవా ఎస్లావత్, ఏఈఆర్ఓలు.. ఏసీపీ రాణి, ఏఎంసీలు కమల్ పాల్గొన్నారు.

## తలసానిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం

బేగంపేట్ అక్టోబర్ 27: సనత్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అత్యంత మెజార్టీతో గెలుస్తాడని బేగంపేట్ కార్పొరేటర్ టి. మహేశ్వరి ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం బేగంపేట్‌లోని మాతాజీనగర్‌లో ఆమె స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ.. ప్రచారంలో ఓటర్ల నుంచి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రజలను చైతన్య వంతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకుడు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



బేగంపేట్ మాతాజీనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి